బస్తీలకు భారీ ముప్పు

- నాలాలో పూడిక తీశామంటున్న అధికారులు
- తీయలేదంటున్న స్థానికులు
- ఇటీవలే నాలా పై నుంచి ఉబికిన వర్షంనీరు

ఖైరతాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రతియేటా వర్షాకాలానికి ముందే జీహెచ్ఎంసీ నాలాలు, కచ్చా మోరీలు, రోడ్లపై ఉన్న మ్యాన్‌హోళ్ల వద్ద పూడిక తీస్తుంటారు. దీనికోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తారు. ఈ పనులు ఈసారి అంతంత మాత్రంగానే జరిగాయి. ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యంతో పూడికతీత పనులు సరిగా జరగకపోవడం వల్ల ఖైరతాబాద్ సర్కిల్ లోని బుల్కాపూర్ నాలాకు వచ్చే మారుతీ నగర్, రాజ్ నగర్ తోపాటు చింతల బస్తీ, తుమ్మల బస్తీలకు భారీ వర్షాలు పడితే పెను ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే 10 రోజుల క్రితం పడ్డ భారీ వర్షానికి ఈ ప్రాంతాల్లో నాలా పై నుంచి నీరు పైకి వచ్చి బస్తీలను ముంచెత్తింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత భారీ వర్షాలు ఏ పరిస్థితికి దారి తీస్తాయోనని ప్రజలు భయపడుతున్నారు.

కొన్నేళ్ల తర్వాత..

గతంలో చిన్న వర్షానికే ఖైరతాబాద్ మారుతీ నగర్, రాజ్ నగర్‌ను అనుసంధానించే బుల్కాపూర్ నాలా బ్రిడ్జి పై నుంచి నీరు ఉబికి వచ్చేవి. రెండుసార్లు ఇక్కడ నిలిచే నీటిని లేక్ వ్యూ పార్కు నుంచి హుస్సేన్‌సాగర్ లోకి, అక్కడ ఎక్కువైతే మూసీలోకి నీరు వెళ్లేలా పైపలైన్లు వేశారు. దీనితో పాటు మారుతీ నగర్, రాజ్ నగర్‌ను కలిపే బ్రిడ్జి రోడ్డును పైకి ఎత్తడంతో కొంతమేరకు ముంపు సమస్య తగ్గింది. ప్రతీసారి స్థానికులు పట్టుబట్టి ముంపునకు గురికాకుండా అధికారులపై ఒత్తిడి తెచ్చి నాలాలోని పూడికను దగ్గరుండి తీయించేవారు. కాగా, ఈసారి పనులు తూతూ మంత్రంగా ముగించడంతో పరిస్థితి మొదటికి వచ్చింది. పెన్షన్ ఆఫీస్ చౌరస్తా నుంచి చింతల్ బస్తీ మీదుగా తుమ్మల బస్తీ నాసర్ స్కూల్ వరకు ఉన్న నాలాలో సైతం పూడిక తీత పనులు అరకొరగా జరిగాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ మధ్య 8 నుంచి 10 సెంటీమీటర్ల వర్షం పడితేనే నాలా పై నుంచి నీరు బయటకు వచ్చి బస్తీల్లోకి వచ్చాయని, భారీ నుంచి అతి భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ముంపు ప్రాంతాలైన మారుతీనగర్, రాజ్ నగర్, చింతల బస్తీ, తుమ్మల బస్తీల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై నాలాల్లో పూడికను సరిగా తీయకుండా ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కనీసం సగం పనులైనా పూర్తి చేయకుండా మొత్తం పని పూర్తయినట్లు రికార్డుల్లో రాసుకోవడంపై ఉన్నతాధికారులు విచారించాలని ప్రజలు కోరుతున్నారు.


మారుతీనగర్, రాజ్‌నగర్ నాలా పై నుంచి వస్తున్న వర్షంనీరు


నాలాలో పూడిక తీయకపోవడంతో దానిపైన మొలిచిన చెట్లు

పూడిక తీశాం.. అవసరమైతే మళ్లీ తీస్తాం..

వర్షాకాలానికి ముందే మారుతీ నగర్, రాజ్ నగర్, చింతల బస్తీ, తుమ్మల బస్తీ నాలాల్లో పూడిక పనులను టెండర్ పద్ధతిలో కేటాయించాం. పూడిక తీయించాం. రెండుచోట్ల కొన్ని ఇబ్బందుల వల్ల పనులు పూర్తిగా జరగలేదు. ఒకసారి పరిశీలించి అవసరం పడితే మళ్లీ పూడిక తీయిస్తాం. మారుతీ నగర్, రాజ్ నగర్ నాలాకు చివరి ప్రాంతాలు కావడం వల్ల అక్కడకు వ్యర్థాలు వెంటనే చేరుకుంటాయి. అతి భారీ వర్షాలు పడితేనే సమస్యలు వస్తాయి.

● చైతన్య, డీఈఈ, ఖైరతాబాద్ సర్కిల్

మా కాలనీలు మునిగితే అధికారులదే బాధ్యత



ఈసారి మారుతీ నగర్, రాజ్ నగర్ వద్ద బుల్కాపూర్ నాలాలో పూడిక ఏ మాత్రం తీయలేదు. మాకు తెలియకుండా సిబ్బంది అర్ధరాత్రి వేళల్లో వచ్చి తీశారా? మా రాజ్ నగర్‌లో పూడిక తీయడం ఏ ఒక్కరు చూడలేదు. నాలాల్లో పేరుకున్న వ్యర్థాలపై మొక్కలు పెరిగాయి. భారీ వర్షాలకు మా కాలనీలు నీట మునిగితే జీహెచ్ఎంసీ అధికారులే బాధ్యత వహించాలి.

● శ్రీనివాస్ అధ్యక్షుడు, రాజ్ నగర్ సంక్షేమ సంఘం

మారుతీ నగర్ నాలా వద్ద నిండిన చెత్త



అప్పట్లో మారుతీ నగర్ ముంపు సమస్య కోసం కోటి రూపాయలతో వేసిన పైప్‌లైన్‌కు లేక్ వ్యూ పార్కు నుంచి నీరు వెళ్లేలా అనుసంధానం చేశారు. అక్కడ చెత్త పూడుకుపోయి నీరు వెళ్లడం లేదు. దీనితో పాటు పూడిక తీత పనులు సరిగా చేయక పోవడంతో మాకు 20సంవత్సరాల క్రితం ఉన్న సమస్య మళ్లీ వచ్చింది. వెంటనే అధికారులు నాలాతో పాటు నీరు సాఫీగా వెళ్లే అన్ని ప్రాంతాల్లో పనులు చేపట్టాలి. ఒకవైపు నీటిని పంపు చేసే మోటారు కూడా పనిచేయడం లేదు

● కాంతం ప్రేమ్ కుమార్, ఉద్యోగి, మారుతీ నగర్


గణేశ్‌నగర్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ మహేష్‌యాదవ్

వర్షం నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలి

బేగంపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వర్షం నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని మాజీ కార్పొరేటర్ ఎలిగల మహేష్‌యాదవ్ అన్నారు. సోమాజిగూడ డివిజన్‌లోని బిగ్ బజార్ ఎదురుగా ఉన్న గణేశ్‌నగర్ ప్రాంతంలో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో వర్షం నీరు భారీగా నిలవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ వనం సంగీతయాదవ్ సమస్యను పరిష్కరించడంలో పూర్తిగా విఫలయ్యారని విమర్శించారు.


వెంగళరావునగర్ కాలనీ డి-180 వద్ద పొంగుతున్న సివరేజీ లైన్

నిత్యం పొంగుతున్న సివరేజీ లైన్

- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

వెంగళరావునగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ కాలనీ డి-180 వద్ద సివరేజీ లైన్ నిత్యం పొంగుతూ మురుగునీరు రహదారిపై ప్రవహిస్తున్నా జలమండలి అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దుర్వాసనకు ఇళ్లలో ఉండలేక పోతున్నామని కాలనీ సంక్షేమ సమితి అధ్యక్షుడు చిలకల వెంకటేశ్వరరావు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు.


సమావేశంలో ప్రొఫెసర్ డి.ఎస్.ఆర్ రాజేంద్ర సింగ్, ప్రొఫెసర్ బాలభాస్కర్ తదితరులు

కృత్రిమ మేథ(ఏఐ)పై పట్టు సాధించాలి

పంజాగుట్ట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేథ(ఏఐ)పై పట్టు సాధించి, మార్కెట్ అవసరాలకు తగ్గట్టు విద్యార్థులను తీర్చిదిద్దాలని వక్తలు పిలుపునిచ్చారు. ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్య, వ్యాపార నిర్వహణ విభాగం ఆధ్వర్యంలో ఐపీఈ భాగస్వామ్యంతో రాష్ట్ర కళాశాల విద్యాశాఖ సహకారంతో బుధవారం కళాశాల ఆడిటోరియంలో కృత్రిమ మేథస్సు సమర్థవంతమైన బోధన, అభ్యసన, పరిశోధన అనే అంశంపై ఒక రోజు జాతీయ శిక్షణా శిబిరం జరిగింది. ఉన్నత విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్లు ప్రొఫెసర్ డి.ఎస్.ఆర్.రాజేంద్ర సింగ్, ప్రొఫెసర్ బాలభాస్కర్, పీఎం ఉషా ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ సౌందర్య జోసెఫ్, ఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాసమూర్తి, ఉస్మానియా యూనివర్సిటీ వాణిజ్య విభాగాధిపతి ప్రొఫెసర్ గంగాధర్, వాణిజ్య విభాగం డీన్ ప్రొఫెసర్ కృష్ణచైతన్య, తదితరులు మాట్లాడారు. పరిశోధనలో కృత్రిమ మేథ వినియోగాన్ని నైతికంగా చేయాలని, అలాగే తరగతి గది బోధనలో ఏఐ, మెషీన్ లెర్నింగ్‌ను సమర్థవంతంగా అవలంబించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్ డి.చెన్నప్ప, వాణిజ్య విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ ప్రొఫెసర్ ప్యాట్రిక్ ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ రామకృష్ణ యలమంచి, అసిస్టెంట్ ప్రొఫెసర్ కళ్యాణి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.రాజేంద్ర కుమార్, ప్రొఫెసర్ వి.ప్రభాకర్, శిబిరం కన్వీనర్ ఆర్.వైష్ణవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అడ్డా కూలీలకు అల్పాహారం పంపిణీ

యూసు‌ఫ్‌గూడ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కృష్ణానగర్ లేబర్ అడ్డా దినసరి కూలీలకు, జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులకు మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గుర్రం మురళీగౌడ్ బుధవారం అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ నాయకులు వినోద్, మహ్మద్ గౌస్, దొండేటి వెంకటరెడ్డి, కొండపల్లి రమేష్, ముత్యాల యాదగిరి, చెగురి సత్యనారాయణ, రాగిణి యాదయ్య, అరుణ్, నాగరాజు, వినయ్ పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ప్రిన్సిపాల్ డా.పద్మావతి

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

బేగంపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.కె.పద్మావతి అన్నారు. బుధవారం కళాశాలలో మాదక ద్రవ్యాల వినియోగాన్ని వ్యతిరేకిస్తూ నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 19 మందికి జైలు.. 75 మందికి జరిమానా

ఖైరతాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ఉక్కుపాదం మోపుతూ ట్రాఫిక్ పోలీసులు ప్రతి రోజూ విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. సెంట్రల్‌జోన్ ట్రాఫిక్ విభాగం ఆధ్వర్యంలో పలు పోలీస్‌స్టేషన్ల పరిధుల్లో జరిపిన తనిఖీల్లో కేసులు నమోదైన వారిని నాంపల్లి కోర్టులో హాజరుపరచగా 19 మందికి జైలు శిక్ష పడింది. ట్రాఫిక్ ఏసీపీ మోహన్‌కుమార్ నేతృత్వంలో మొత్తం 94 మందిని ఈ కేసుల్లో న్యాయస్థానం ఎదుట ప్రవేశపెట్టగా, 75 మందికి రూ.3,100 చొప్పున జరిమానా విధించారు. ఒకరికి 16 రోజులు, ఇద్దరికి 10 రోజులు, మరో ఇద్దరికి 3 రోజులు, 14 మందికి 6 రోజుల చొప్పున జైలు శిక్ష పడింది.

ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలి

వెంగళరావునగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ కాలనీలో ట్రాఫిక్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వెంగళరావునగర్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ పీవీ రవిశేఖర్‌రెడ్డి, సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు బుధవారం పంజాగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పీవీ రాంప్రసాద్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రంగారావు, ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ టీవీరెడ్డి, ప్రధానకార్యదర్శి సారంగారావు, కోశాధికారి లక్ష్మీకాంతరావు, తదితరులు పాల్గొన్నారు.

సింథటిక్ డ్రగ్స్ పట్టివేత

యూసుఫ్‌గూడ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాన్ని విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి నాలుగు గ్రాముల ఎండీఎంఏ సింథటిక్ 0.75 డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. సీఐ ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిగూడకు చెందిన రజాక్ బెంగళూరు నుంచి డ్రగ్స్ తీసుకువచ్చి రహస్యంగా విక్రయిస్తున్నట్టు సమాచారం అందింది. సీఐ సిబ్బందితో కలిసి ఎల్లారెడ్డిగూడకు వెళ్లారు. పోలీసుల రాకను గమనించిన రజాక్ పారిపోయేందుకు ప్రయత్నించగా, వెంబడించి చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద ఉన్న సింథటిక్ 0.75 గ్రాముల బరువున్న నాలుగు గ్రాముల డ్రగ్స్ స్వాధీనం చేసుకొని విచారించగా, ఐదు నుంచి పది వేల రూపాయలకు విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి


మాట్లాడుతున్న మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్

ఎర్రగడ్డ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగరవేయాలని మాజీ ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. ఎర్రగడ్డ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కంచర్ల అశోక్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం ఎర్రగడ్డలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ కంజర్ల శ్రీనివాస్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి దూడల రవిగౌడ్, సికింద్రాబాద్ జిల్లా మైనార్టీ విభాగం చైర్మన్ మహ్మద్ మోసిన్ ఖురేషి, వైస్ చైర్మన్ మహ్మద్ సర్దార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎర్ర కృష్ణ కుమార్, నాయకులు భిక్షపతి, నర్సింగ్‌రావు, మహ్మద్ ఖాజా పాషా పాల్గొన్నారు.

పోటీ చేయాలనే ఆలోచన లేదు

- సీఏ వేణుగోపాలస్వామి

పంజాగుట్ట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఎవరికి టిక్కెట్ ఇచ్చినా పది వేల మెజార్టీతో గెలిపిస్తామని, తనకు పోటీ చేయాలనే ఆలోచన లేదని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సీఏ వేణుగోపాలస్వామి తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య పోటీ ఉంటుందని పేర్కొన్నారు.

గంగ తెప్పోత్సవంలో భాగస్వాములు కావాలి

ఖైరతాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గంగ తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించడంలో రాష్ట్రవ్యాప్త గంగపుత్రులు భాగస్వాములు కావాలని తెలంగాణ మత్స్య సహకార సంఘం చైర్మన్ మెట్టు సాయి కుమార్, గంగ తెప్పోత్సవ కమిటీ అధ్యక్షుడు మల్కు మహేందర్‌బాబు పిలుపునిచ్చారు. హుస్సేన్‌సాగర్‌లోని గంగమ్మ ఆలయం వద్ద ప్రతియేటా నిర్వహించే తెలంగాణ గంగ తెప్పోత్సవం 7వ విడత కార్యక్రమం, అనంతరం జరిగే రాష్ట్ర గంగపుత్రుల ఆత్మీయ సమ్మేళనంపై బుధవారం ఖైరతాబాద్ వాసవీ కళ్యాణ మండపంలో సన్నాహక సమావేశం జరిగింది. దీనికి పలు జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ గంగ తెప్పోత్సవంలో లక్ష మంది గంగపుత్రులు పాల్గొని సత్తాచాటాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఈ ఉత్సవాన్ని జాతి పండుగగా భావించి హాజరు కావాలని కోరారు. మహేందర్‌బాబు మాట్లాడుతూ ఈనెల 17న ఉదయం ఏడుగుళ్ల ఆలయం నుంచి ఖైరతాబాద్ గణేశ్ చౌరస్తా మీదుగా హుస్సేన్‌సాగర్‌లోని గంగమ్మ ఆలయం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలంలో చేపల వృత్తిలో ఉండే గంగపుత్రులు చెరువుల్లోకి క్షేమంగా వెళ్లి లాభంగా వచ్చేలా చూడాలని గంగమ్మను కోరుతూ గంగతెప్పతో పాటు చీరలు, సారెలు సమర్పించి మొక్కులు తీర్చుకోవడం సాంప్రదాయంగా వస్తుందని, దానిని కొనసాగిస్తూ గంగ తెప్పోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో గంగ తెప్పోత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి పూస నర్సింహ, కార్యనిర్వాహక అధ్యక్షుడు మంగళపల్లి రాజు, రాష్ట్ర గంగపుత్ర చైతన్య సమితి అధ్యక్షుడు మంగళపల్లి శంకర్, అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్, మహిళా మత్స్య సహకార సంఘం అధ్యక్షురాలు కొప్పు పద్మ, కుల సంఘం నేతలు చందు, అరుణ్ జ్యోతి, శివరత్నం, పిల్లి శంకర్, తుమ్మారు శ్రీరాములు, అల్లం రాజు, భైరు శేఖర్, కుమార్ పాల్గొన్నారు.

అధికారులు, గణేశ్ ఉత్సవాల నిర్వాహకులతో వాట్సాప్ గ్రూపులు

ఖైరతాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గణేశ్ ఉత్సవాల నిర్వాహకులు సంబంధిత అధికారులతో త్వరలో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి సమస్యలు లేకుండా చూడాలని ఖైరతాబాద్ జోన్ కమిషనర్ అనురాగ్ జయంతి సూచించారు. గణేశ్ ఉత్సవాలపై సెంట్రల్ జోన్ పోలీస్ విభాగం పరిధిలోని అన్ని శాఖల అధికారులు, భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు, పలు మండపాల నిర్వాహకులతో ఆయన ఖైరతాబాద్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లితో పాటు పలు విభాగాల అధికారులు పాల్గొని నిర్వాహకుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్టీఆర్‌మార్గంలో క్రేన్ల ఏర్పాటు, మంచినీటి సరఫరా, ప్రధాన ప్రాంతాల్లో భద్రత ఏర్పాట్లపై మరోసారి సమావేశమవుదామని జోనల్ కమిషనర్ తెలిపారు.

రోడ్డును విస్తరించింది

అక్రమ పార్కింగ్ కోసమేనా?

- బి.శంకర్‌లాల్ నగర్‌ జనప్రియ అపార్ట్‌మెంట్స్ పక్కన అక్రమంగా కార్ల పార్కింగ్
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

ఎర్రగడ్డ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్య వైఖరి, ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకుల బాధ్యతారాహిత్యం తదితర కారణాల వల్ల ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ మధ్యకాలంలో బి. శంకర్‌లాల్ నగర్ సున్నంబట్టి నుంచి డాన్ బాస్కో స్కూల్ వరకు రోడ్డును విస్తరించారు. కొన్ని రోజులకే అక్రమ పార్కింగ్‌లు మొదలయ్యాయి సున్నం బట్టి నుంచి మొదలుకొని జనప్రియ అపార్ట్‌మెంట్స్ పార్కు ప్రహరీ నుంచి మన కూరగాయల మార్కెట్ మొదలుకొని డాన్‌బాస్కో స్కూల్ వరకు కుడివైపున రోడ్డుపై పూర్తిగా వాహనాలను కొందరు అక్రమంగా పార్కింగ్ చేస్తున్నారు. రెండు నెలలుగా ఒకేచోట ఇతర రాష్ట్రానికి చెందిన కారును పార్కు చేశారు. స్థానికంగా ఉన్న రోడ్లపై ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులు, ట్యాక్సీ డ్రైవర్లు వాహనాలను కాలనీలోని రోడ్లపై పార్కు చేస్తుండడం వల్ల స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ట్రాఫిక్ పోలీసులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదీ కొంతకాలంగా ఎర్రగడ్డ డివిజన్‌లోని బి.శంకర్‌లాల్ నగర్ వద్ద సున్నంబట్టి ప్రాంతంలో నెలకొన్న పరిస్థితి.

అసాంఘిక కార్యకలాపాలు

వాహనాల పార్కింగ్ ముసుగులో అసాంఘిక కార్యకలాపాలు కూడా కొనసాగుతున్నాయని స్థానికులు, వాహనదారులు ఆరోపిస్తున్నారు. వాహనాల చాటున కొందరు మద్యం తాగడం, జూదం ఆడడం, డ్రగ్స్ తీసుకోవడం లాంటివి కూడా చేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు.

వాహనాలను ధ్వంసం చేసినా..

పార్కు చేస్తున్న వాహనాల అద్దాలు పగలగొట్టడం, టైర్లలోని గాలిని తీయడం, తదితర రకాలుగా వాహనాలను స్థానికులు ధ్వంసం చేసినప్పుడు కొన్ని రోజుల వరకు ఇక్కడ వాహనాలను పార్కు చేయడం మానేస్తున్నారు. వారం, పది రోజుల తర్వాత తిరిగి వాహనాలను పార్కు చేస్తున్నారు. ఎన్నిసార్లు వాహనాలను ధ్వంసం చేసినా, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా వాహనాల పార్కింగ్‌ను మాత్రం వారు మానడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.


బి. శంకర్‌లాల్ నగర్ రోడ్డులో అక్రమంగా పార్కింగ్ చేసిన వాహనాలు


జనప్రియ అపార్ట్‌మెంట్స్ మన కూరగాయలు రోడ్డులో అక్రమంగా పార్కింగ్ చేసిన వాహనాలు



ఫుట్‌పాత్‌ను ఆక్రమించి ఏర్పాటు చేసుకున్న దుకాణాలు



రెండు నెలలుగా ఒకేచోట పార్కింగ్ చేసిన ఇతర రాష్ట్రానికి చెందిన కారు

అక్రమ పార్కింగ్‌లపై కఠిన చర్యలు



అక్రమంగా వాహనాలను పార్కింగ్ చేస్తున్న వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలి. ఎంతోకాలంగా ఇక్కడ ట్రావెల్స్, ట్యాక్సీ డ్రైవర్లు వాహనాలను పార్కింగ్ చేస్తున్నా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ఫలితంగా మేము కష్టాలపాలవుతున్నాం. ఎన్ని పర్యాయాలు అధికారులతో మొరపెట్టుకున్నా ఎటువంటి ఫలితం లేకుండా పోతోంది. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టం వచ్చిన ప్రాంతాల్లో పార్కింగ్ చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలి. లేనిపక్షంలో ఇప్పటి వరకు ఈ అక్రమ పార్కింగ్‌ల విషయమై స్పందించని మేమంతా ఏకమై పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతాం.

- ఇర్ఫాన్, సుల్తాన్ నగర్

ట్రాఫిక్ సమస్య..



వాహనాల అక్రమ పార్కింగ్ వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ పార్కింగ్‌ల ముసుగులో ఇతర కార్యకలాపాలు కూడా జరుగుతున్నాయి. ఈ విషయంలో క్రైం పోలీసులు కూడా దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలి.

- రమేష్, బి.శంకర్‌లాల్ నగర్

పాత భవన యజమానులు తస్మాత్ జాగ్రత్త


భిక్షపతి, ఎంఆర్ఓ

తిరుమలగిరి ఆగస్ట్ 13 (ఆంధ్రజ్యోతి): వరుసగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తిరుమలగిరి మండల కార్యాలయం పరిధిలోని పాత భవన యజమానులు జాగ్రత్తగా ఉండాలని తిరుమలగిరి మండల కార్యాలయం తహసీల్దార్ భిక్షపతి హెచ్చరించారు. బుధవారం కార్యాలయంలో ఆయన ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు. పాత భవనాలు వర్షాలకు కూలిపోయే ప్రమాదం ఉంటుందని యజమానులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అదేవిధంగా తిరుమలగిరి మండల పరిధిలోని రామన్న కుంట, తిరుమలగిరి చెరువు పరివాహక ప్రాంతాల్లో నివసించే ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వరదలు వచ్చినా, పాత భవనాలు కూలినా తమకు సమాచారం అందించాలని, తమ సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. అలాగే పాత భవనాలు శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉన్నట్లు అనిపించినా సమాచారం ఇవ్వాలని చెప్పారు. నాలాల పక్కకు నివాసం ఉన్నవారు అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సునీల్ కుమార్ (గిర్దావర్)- 7989545988, భాను చందర్ (స్పెషల్ ఆర్ఐ) - 6301566431, హేమంత్ అఖిల్ (స్పెషల్ ఆర్ఐ) -7093458406, వంశీ (స్పెషల్ ఆర్ఐ) - 8309201729, శేఖర్ (రెకార్డ్ అసిస్టెంట్) - 9697311115 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

భారీ వర్షసూచన.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మారేడుపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల నేపథ్యంలో హైదరాబాద్ నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. మూడు, నాలుగు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిందని, అత్యవసరమైతే తప్ప ఇళ్లను నుంచి బయటకు రావద్దని కోరారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, తీగలు తెగిపడటం, వరద నీరు నిలిచిపోవడం, చెట్లు కూలిపోవడం వంటి అత్యవసర పరిస్థితి ఏర్పడినప్పుడు జీహెచ్ఎంసీ హెల్ప్‌లైన్ 21111111, ఫోన్ 040 - 23225397లకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, ఎలక్ట్రికల్ శానిటేషన్ తదితర అన్ని శాఖల అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరుపుతూ ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ వేణుగోపాల్ రెడ్డి

రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత

రెజిమెంటల్‌బజార్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత, విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ వేణుగోపాల్ రెడ్డి అన్నారు. బుధవారం సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీ సెంటినరీ జూనియర్ కాలేజ్ విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలు, నివారణ అనే అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ట్రిపుల్ రైడింగ్, ఓవర్ స్పీడ్, రాంగ్‌రూట్, సిగ్నల్ జంపింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తూ ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బేగంపేట్ టీటీఐ ఇన్‌స్పెక్టర్ నాగుల అశోక్, గోపాలపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్, ప్రిన్సిపాల్ ఫాదర్ వి.జ్ఞాన రెడ్డి, బేగంపేట టీటీఐ సిబ్బంది పాల్గొన్నారు.


చిలకలగూడ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుళ్లకు సన్మానం చేసిన సీఐ అనుదీప్

పోలీసులకు క్రమశిక్షణ అవసరం : సీఐ అనుదీప్

బౌద్ధనగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : పోలీసులకు క్రమ శిక్షణ ఎంతైనా అవసరమని చిలకలగూడ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అనుదీప్ సూచించారు. చిలకలగూడ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏడుగురు కానిస్టేబుళ్లు, నలుగురు ఏఎస్సైలు వివిధ పోలీస్‌స్టేషన్లకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా వారిని పోలీస్‌స్టేషన్‌లో ఘనంగా శాలువా కప్పి సన్మానం చేశారు. కార్యక్రమంలో చిలకలగూడ డీఐ రమేష్ గౌడ్, ఆడ్మిన్ ఎస్సై ఆంజనేయులు, డీఎస్ఐ రాకేష్‌లు పాల్గొన్నారు.

నేడు తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ సమావేశం

అడ్డగుట్ట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం తుకారాంగేట్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద 33 జిల్లాల ఉద్యమ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నామని తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర చైర్మన్ సుల్తాన్ యాదగిరి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణలోని 33 జిల్లాల ఉద్యమకారులతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణ అంశాలపై సమావేశం నిర్వహిస్తామన్నారు. రానున్న పంచాయితీ, మున్సిపల్ ఎన్నికల అంశాలపై ఈ సమావేశంలో చర్చించి నిర్ణయాలు తీసుకుంటామన్నారు.

మైనంపల్లిని కలిసిన నాయకులు

తిరుమలగిరి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును ఆయన నివాసంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జైప్రకాష్, బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ చింతల వేణుగోపాల్ రెడ్డి, తిరుమలగిరి లాల్‌బజార్ హోలీ ఫ్యామిలీ చర్చి ప్యారిస్ కౌన్సిల్ మాజీ వైస్ ప్రెసిడెంట్ మైఖెల్ అబ్రహంలు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి ఆయనను సత్కరించారు.

రోడ్లను తవ్వారు.. వదిలేశారు

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలోని రంగ్రేజ్ బజార్‌లో అంతర్గత రహదారులను సీవరేజ్ పైప్‌లైన్ పనుల కోసం తవ్వి వాటిని పూర్తిస్థాయిలో తిరిగి వేయక పోవడంతో అవి గుంతలమయంగా మారాయి. దీంతో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులకు ఇబ్బందికరంగా తయారయ్యాయి. గతుకుల రహదారుల వల్ల అనేకసార్లు వాహనదారులు కింద పడి గాయాలపాలయ్యారు. స్థానిక శాసనసభ్యులు తలసాని అంతర్గత రహదారుల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు కానీ ఇప్పటి వరకు పనులు మొదలుపెట్టలేదు. ఇప్పటికైనా పనులు ప్రారంభించి పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.


సీవరేజ్ పైప్‌లైన్ పనుల కోసం తవ్విన రోడ్డు

ఆవును దొంగిలించిన ముఠా అరెస్టు

రెజిమెంటల్‌బజార్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ మార్కెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఆవు దొంగతనం కేసులో ఏడుగురిని మార్కెట్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. జూలైలో బండిమెట్‌లో రోడ్డుపై ఉన్న ఓ ఆవుకు ఇంజక్షన్ ఇచ్చి కారులో తీసుకెళ్లిపోయారు. ఈ విషయమై ఆవు యాజమాని మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ముఠా సభ్యులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిసింది.

వినాయక వేడుకలను ప్రశాంతంగా నిర్వహించాలి

- గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులతో అధికారుల సమీక్ష

సికింద్రాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న వినాయక చవితి వేడుకలను పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించడానికి అధికార యంత్రాంగం ఇప్పటినుంచే దృష్టి సారించింది. గత ఏడాది వేడుకల సందర్భంగా నిర్వహించిన తీరుతెన్నులను సమీక్షించి, గతంలో లోపాలేమైనా ఉంటే వాటిని సరిచేసుకుని, ఈ ఏడాది విజయవంతం చేయాలని అధికారులు యోచిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ రవికిరణ్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం జరిగింది. రాబోయే ఉత్సవాల సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై ఆయా విభాగాల ఉన్నతాధికారులతో ఆయన విస్తృతంగా చర్చించి అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. భాగ్యనగర గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధుల సూచనలు, సలహాలను పరిగణలోకి తీసుకున్నారు.

- నిమజ్జనోత్సవ ఊరేగింపు జరిగే మార్గాలను గుంతల రహితంగా తీర్చిదిద్దాలని, చెరువుల సిద్ధత కోసం కార్మికుల ఏర్పాట్లు, నీటిని నింపే ప్రణాళికలు, పోర్టబుల్ చెరువుల జాబితా పూర్తి చేయాలని నిర్ణయించారు. అలాగే రోడ్లపై, తాత్కాలిక చెరువుల వద్ద లైటింగ్ ఏర్పాటు చేయాలని ఎలక్ట్రికల్ విభాగానికి జోనల్ కమిషనర్ రవికిరణ్ ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా ఊరేగింపు మార్గాల్లో చెట్ల కొమ్మల తొలగింపు, స్పాట్ క్లియరెన్స్ చేసి ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల వరకు శుభ్రపరచే పనులు చేపట్టాలని ఆయన పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ రవికిరణ్

- శుభ్రత చర్యల ప్రణాళికలో జీపీటీఎస్ స్కెచ్, చెరువు వారీగా పర్యవేక్షణ, మొబైల్ టాయిలెట్లను క్లీనింగ్ ఏజెన్సీలకు కేటాయించి కాంటాక్ట్ నంబర్లతో బ్యానర్లు ప్రదర్శించాలి. ప్రసాదం, తాగునీటి పాయింట్ల వద్ద వ్యర్థాల డ్రమ్ములు, కార్మికులు ఉండేలా చూడడం, చెత్త లిఫ్టింగ్ వాహనాలు 24గంటలూ పని చేసేలా చూడడం తదితర జాగ్రత్తలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు.
- మండపాల నిర్వాహకుల కాంటాక్ట్ నెంబర్లను పోలీసులకు అందచేయడం, సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు, అగ్నిమాపక నిరోధకాలను సిద్ధంగా ఉంచడం తదితర సూచనలను జోనల్ కమిషనర్ చేశారు. సమావేశంలో అదనపు డీసీపీ సి.వెంకటగోపాల్ రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు, కంటోన్మెంట్ జాయింట్ సీఈఓ పల్లవి విజయ్‌వంశీ, జీహెచ్ఎంసీ ఎస్ఈ, సిటీ ప్లానర్ శ్రీనివాస్, హార్టికల్చర్ డీఈ అనిల్, జోనల్ సీటీవో శ్రీనివాస్, ఆయా సర్కిళ్ల ఉప కమిషనర్లు పి.మంజులారెడ్డి, ఎ.మారుతి దివాకర్, జకియా సుల్తానా, ఆంజనేయులు, దనవత్ డాకు నాయక్, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కార్యదర్శి బుచ్చిరెడ్డి, సెంట్రల్ కమిటీ సభ్యులు టి.ఎన్.మురారి, రాహుల్ స్వగత్, రుత్విక్, దాస్ తదితరులు పాల్గొన్నారు.

జేబీఎస్‌ను మోడల్ బస్‌స్టేషన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

మారేడుపల్లి, ఆగస్ట్ 13 (ఆంధ్రజ్యోతి) : జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి తెలంగాణలోని అన్ని జిల్లాలకు మరింతగా రవాణా సౌకర్యం కల్పించేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. బుధవారం జూబ్లీ బస్‌స్టేషన్ డిపో, కంటోన్మెంట్ బస్ డిపోల్లో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా డిపో అధికారులు, ట్రాఫిక్ పోలీసులు, సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా జేబీఎస్‌లోకి వచ్చే బస్సులు మెయిన్ గేట్‌లో ఆపి ప్రయాణికులను దించడంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతుందని, కంటోన్మెంట్ బోర్డు స్థలాన్ని కొంత ఇప్పిస్తే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని అధికారులు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు సౌకర్యాలను కల్పించడంతో పాటు జేబీఎస్‌ను మోడల్ బస్‌స్టేషన్‌గా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. మహిళాశక్తి పథకం ద్వారా కంటోన్మెంట్ నియోజకవర్గంలోని మహిళలకు బస్సులను ఇప్పించడానికి సిద్ధంగా ఉన్నామని, ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం కావాలన్నా నా దృష్టికి తీసుకువస్తే రవాణామంత్రి పొన్నం ప్రభాకర్, ఉన్నతాధికారులతో మాట్లాడతానని తెలిపారు. ఆర్టీసీ ఉన్నత అధికారులతో పాటు కంటోన్మెంట్ బోర్డ్ మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, మారేడుపల్లి ఇన్‌స్పెక్టర్ ఎన్.వెంకటేశం, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఆర్టీసీ ఉన్నతాధికారులతో కలిసి జేబీఎస్‌లో పర్యటించిన ఎమ్మెల్యే శ్రీగణేష్

మర్రి రామ్‌రెడ్డి కాలనీలో సీఈఓ పర్యటన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బోయినపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : చినుకుపడితే చిత్తడే శీర్షికన బోయినపల్లి మర్రి రామ్‌రెడ్డి కాలనీతోపాటు పలు కాలనీల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన కథనానికి కంటోన్మెంట్ బోర్డు అధికారులు, సీఈఓ స్పందించారు. ఈ నేపథ్యంలో బోర్డు సీఈఓ అధికార బృందంతో బుధవారం ఈ ప్రాంతంలో పర్యటించి సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మాల్యాద్రి, ఈశ్వర కృష్ణలు స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఈఓను కోరారు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీటితోనే తమ కాలనీకి ముంపు సమస్య తలెత్తుతుందని, వరదనీటి డ్రైనేజీ కనెక్షన్లను సౌజన్య కాలనీ మీదుగా ఓపెన్ నాలాకు అనుసంధానం చేస్తే సమస్య కొంత మేరకు పరిష్కారమవుందని సీఈఓకు తెలిపారు. అలాగే హర్షవర్ధన్ కాలనీకి, తమ కాలనీకి మధ్యలో ఉన్న ప్రైవేట్ ల్యాండ్ వద్ద గోడను ఏర్పాటు చేసుకుంటామని దీనికి బోర్డు అనుమతిస్తే బాగుంటుందని వారు కోరారు. కాలనీలో దోమల సమస్య, రోడ్డు వెడల్పు, కాలనీ చుట్టూ ఉన్న స్థలంలో ప్రైవేటు వ్యక్తులు భవన నిర్మాణ వ్యర్థాలు డంపు చేస్తున్నారని దాంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ప్రతినిధులు సీఈఓకు వివరించడంతో వీలైనంత త్వరితగతిన సమస్య పరిష్కారానికి ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు తెలిపారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలని, ముంపునకు గురి కావడానికి కారణమైన భవన నిర్మాణాలకు నోటీసులు అందించాలని అధికారులను ఆదేశించారు. వర్షం కురుస్తున్న సమయాలలో అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తూ సహాయక చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి వ్యాధులు సోకకుండా ఎప్పటికప్పుడు మురుగు వెళ్లడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, నాలాలపై అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కూల్చివేతలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బోర్డు అధికారులు ఫణి కుమార్, స్థానికులు చెన్నకేశవులు, నాగేశ్వర్‌రావు, కృష్ణ యాదవ్‌తో పాటు, సీతారాంపురం కాలనీ వాసులు, సాయిబాబా యాదవ్, ప్రకాష్, విజయ్ బాబు, మనోహర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.


మర్రి రామ్‌రెడ్డి కాలనీలో పర్యటిస్తున్న కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్, ఫణి కుమార్‌లతో స్థానికులు



ర్యాలీలో పాల్గొన్న ప్రిన్సిపాల్ డా.పద్మావతి

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

బేగంపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.పద్మావతి అన్నారు. బుధవారం కళాశాలలో మాదక ద్రవ్యాల వినియోగాన్ని వ్యతిరేకిస్తూ నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు,విద్యార్థినులు పాల్గొన్నారు.


గణేశ్‌నగర్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ మహేష్‌యాదవ్

వర్షంనీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలి

బేగంపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వర్షం నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని మాజీ కార్పొరేటర్ ఎలిగల మహేష్‌యాదవ్ అన్నారు. సోమాజిగూడ డివిజన్‌లోని బిగ్ బజార్ ఎదురుగా ఉన్న గణేశ్‌నగర్ ప్రాంతంలో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో వర్షం నీరు భారీగా నిలవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ వనం సంగీతయాదవ్ సమస్యను పరిష్కరించడంలో పూర్తిగా విఫలయ్యారని విమర్శించారు.

ఉన్నత విద్యకు పేద, మధ్యతరగతి విద్యార్థులు దూరం

- ఓయూ మాజీ జాయింట్ రిజిస్ట్రార్ ఉప్పరి ఎల్లేష్

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నేషనల్ ఫెలోషిప్‌ను రద్దుచేసి ప్రైవేటు యూనివర్సిటీలకు ద్వారాలు తెరుస్తూ పేద, మధ్యతరగతి విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తోందని ఏఐఎస్ఎఫ్ మాజీ నేత, ఓయూ మాజీ జాయింట్ రిజిస్ట్రార్ ఉప్పరి ఎల్లేష్ ఆరోపించారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 90వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఉస్మానియా యూనివర్సిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన జెండా ఆవిష్కరించి మాట్లాడారు.

ఉత్తర ప్రదేశ్ బెనారస్ విశ్వవిద్యాలయంలో 1936 ఆగస్టు 12న బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా చేసిన పోరాటాలలో పాల్గొన్న ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని, అప్పటి నుంచి విద్యారంగ సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేస్తూనే ఉందని గుర్తు చేశారు. కొఠారీ కమిషన్ సూచించినట్టు కేంద్ర బడ్జెట్లో విద్యారంగానికి 10శాతం నిధులు ఇప్పటి వరకు కేటాయించలేదని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి బడ్జెట్‌లో కేవలం 7.3 శాతం నిధులు కేటాయించిదని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావస్తున్నా విద్యాశాఖ మంత్రిని నియమించకుండా, సుమారు రూ.8వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని ఆరోపించారు. దీనికి వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షుడు లెనిన్, కార్యదర్శి నెల్లి సత్య, సహాయ కార్యదర్శి ఉప్పల ఉదయ్ కుమార్, నాయకులు అశ్వన్, మధు, లింగస్వామి, నిజాం కళాశాల కన్వీనర్ సుశాంత్, కార్తిక్, జితేందర్, అంజి, లింగా, శివ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరిలో జాతీయ భావం పెరగాలి

- మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ


జెండా ఊపి తిరంగా ర్యాలీని ప్రారంభిస్తున్న బండారు దత్తాత్రేయ


వర్షాన్ని కూడా లెక్కచేయకుండా తిరంగా ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరిలో జాతీయ భావం పెరగాలని హర్యానా మాజీ గవర్నర్ బండారు దాత్తాత్రేయ పిలుపునిచ్చారు. బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది రవీందర్ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. బుధవారం సికింద్రాబాద్ పీజీ రోడ్డులోని వెస్లీ ఐటీ కళాశాల నుంచి సిల్వైన్, నల్లగుట్ట సుభాష్ రోడ్ల మీదుగా మహాత్మాగాంధీ రోడ్డులోని గాంధీ విగ్రహం వరకు సాగింది. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల గురించి ప్రతిఒక్కరు తెలుసుకోవాలని సూచించారు. ఈ ర్యాలీలో మోండా కార్పొరేటర్ కొంతం దీపిక, అమీర్‌పేట్ కార్పొరేటర్ కేతినేని సరళ, డివిజన్ ప్రధాన కార్యదర్శి అనీష్ వర్మ, నాయకులు చికోటి శ్రీనివాస్, శ్రవణ్, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంలో భాగంగా సర్టిఫికెట్లను అందుకుంటున్న యువతీ యువకులు

సెట్విన్ సేవలు సద్వినియోగం చేసుకోండి

అడ్డగుట్ట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : సెట్విన్ నిర్వహించే వివిధ కోర్సులను యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని సెట్విన్ సౌత్ రీజియన్ కోఆర్డినేటర్ అభిబుద్దీన్ సూచించారు. మారేడుపల్లి సెట్విన్ సెంటర్‌లో ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంలో భాగంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతివృత్తులు, కులవృత్తుల వారిని ప్రోత్సహిస్తూ యువతి యువకులకు చేయూతనిస్తు సెట్విన్ అండగా నిలిచిందన్నారు. వివిధ కోర్సుల్లో శిక్షణ అనంతరం నైపుణ్యం సంపాదించిన యువతీ యువకులకు సర్టిఫికెట్లను అందజేశామన్నారు. కార్యక్రమంలో ప్రోగాం ఇన్‌చార్జి ఆమీనాబాను, సెంటర్ ఇన్‌చార్జి విజయశ్రీ, బ్యూటీషియన్ ఫ్యాకల్టీ ట్యూటర్ ఇన్‌చార్జి లతలతో పాటు పలువురు పాల్గొన్నారు.


తిరంగా ర్యాలీలో పాల్గొన్న భరత్‌గౌడ్, మేకల సారంగపాణి తదితరులు

బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ

సికింద్రాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం సికింద్రాబాద్ నియోజకవర్గం సీతాఫల్‌మండి డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఈ.వి.నరేష్ ఆధ్వర్యంలో శివాజీ విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణిలు అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతోమంది త్యాగధనులు వారి ప్రాణాలను త్యాగం చేసి దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చారని అన్నారు. వారిచ్చిన స్వేచ్ఛ నేడు భారత్ అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా, ప్రపంచంలో నాలుగో స్థానానికి ఎగబాకిందని పేర్కొన్నారు. రాచమల్ల కృష్ణమూర్తి, కలకట్ల హరి, నాగేశ్వర్‌రెడ్డి, అంబాల రాజేశ్వర్‌రావు, ప్రభుగుప్తా, వెంకటేష్‌గౌడ్, సురేష్ ముదిరాజ్, మహంకాళి చోటా ప్రభువు, సతీష్‌ముదిరాజ్, హనుమంతు ముదిరాజ్, కరుణాకర్, శ్రీధర్‌రావు, వేణుగోపాల్, లక్ష్మణ్‌రావు, సంపత్, కుమారస్వామి, సందీప్, నరహరి, మహేష్ పాల్గొన్నారు.

అడ్డగుట్టలో..

హర్ ఘర్ తీరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ అడ్డగుట్ట డివిజన్ యువమోర్చా అధ్యక్షుడు విజయ్ కుమార్ యాదవ్, మహిళా మోర్చా నాయకురాళ్ల ఆధ్వర్యంలో బుధవారం తుకారాంగేట్ నుంచి పలు ప్రాంతాల కూడళ్ల వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షురాలు గాజుల సౌందర్య, బీజేపీ సీనియర్ నాయకులు హరిశివప్రసాద్, రాజు, చిరంజీవి, కృష్ణ, సాయి, శివాజీ, మహేందర్, విజయ్, స్వామి, కళావతి, ప్రేమలత, వసంత, రాములమ్మ, విజయలక్ష్మి, కల్యాణిలు పాల్గొన్నారు.



ఆలుగడ్డబావి ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీత

వర్షంతో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

చిలకలగూడ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షం సూచనలతో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపడుతున్నట్టు మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత తెలిపారు. బుధవారం ఆలుగడ్డబావి రైల్వే అండర్ బ్రిడ్జి ప్రాంతాన్ని డీఆర్ఎఫ్, పోలీసులు, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. లోతట్టు ప్రాంతం కావడంతో చిన్నపాటి వర్షానికే తరచూ నీరు నిలిచి ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో వర్షపునీరు నిలువకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె సూచించారు.

కట్టమైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

తిరుమలగిరి ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం బోనాల జాతరలో భాగంగా తిరుమలగిరి విలేజ్ తిరుమలగిరి చెరువుకట్ట మీద ఉన్న కట్టమైసమ్మ దేవాలయంలో నిర్వాహకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకం, అర్చన, కుంకుమార్చన, పుష్పార్చన నిర్వహించారు. వచ్చే సంవత్సరం బోనాల వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని నిర్వాహకులు అన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన వారిలో దేవాలయం కమిటీ ప్రధాన కార్యదర్శి రాజా రెడ్డి, కోశాధికారి ఉమేష్‌లు పాల్గొన్నారు.

18న కాలభైరవ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం

మారేడుపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : వెస్ట్ మారేడుపల్లి అంజయ్య గార్డెన్ లలితానగర్ కాలనీలోని మైసమ్మ, నల్లపోచమ్మ ఆలయ ప్రాంగణంలో ఈ నెల 18న ఉదయం 9.17 నిమిషాలకు సిద్ధి గణపతి, శివలింగం కాలభైరవ, అభయాంజనేయ, నవగ్రహ విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు ఎస్.దశరథ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయకమిటీ అధ్వర్యంలో నిర్వహించే ఈ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమానికి సికింద్రాబాద్, కంటోన్మెంట్ చుట్టూ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చి పాల్గొనాలని వారు కోరారు. మధ్యాహ్నం తీర్థ ప్రసాద కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.